క్లుప్తంగా

మేజిస్ట్రేట్ విచారణ జరపాలి

ప్రకాశం నగర్: గోకవరం మండలం తిరుమలాయపాలెంలో జరిగిన దళితులపై దాడి ఘటనపై ప్రభుత్వం స్పందించి మేజిస్ట్రేట్ విచారణ జరపాలని, పోలీసులపై కేసు నమోదు చేయాలని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు తాటిపాక మధు, టి.అరుణ్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం వామపక్షాల సమావేశం నిర్వహించారు. తాగునీటి సమస్య, పేపర్ మిల్లు యాజమాన్యం వైఖరి, విద్యుత్ చార్జీల పెంపుపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించారు. తిరుమలాయపాలెం ఘటనపై శనివారం కలెక్టర్‌ను కలుస్తామని, ఈనెల 21న తిరుమలపాలెంకు రాజకీయ, దళిత, ప్రజాసంఘాల నాయకులతో కలిసి భరోసా యాత్ర చేపడుతున్నామన్నారు. సమావేశంలో కుంద్రపు రాంబాబు, వి.కొండలరావు, బి.రాజు లోవ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న డీఐ దిలీప్ కుమార్

కంబాలచెరువు: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రాజమహేంద్రవరం నగర శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల డైరీని శుక్రవారం అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకితభావంతో నిబద్ధతతో పనిచేసి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. అధ్యక్షుడు ఎస్.రవిబాబు మాట్లాడుతూ యూటీఎఫ్ రాష్ట్రంలోనే అత్యధిక ఉపాధ్యాయ సభ్యత్వం కలిగిన సంఘమని, విద్యార్థుల కోసం టెస్ట్ పేపర్లు, స్టడీ మెటీరియల్‌ను తయారు చేసి, వారు మంచి ఫలితాలు సాధించడంలో సహాయపడుతోందన్నారు. ప్రధాన కార్యదర్శి నరేష్, సహాధ్యక్షుడు ఎండీ అలీమ్ బేగ్, కోశాధికారి ఎస్.తేజ విజయ్ కుమార్, కుటుంబ సంక్షేమ బాధ్యులు ఎం.శివాజీ పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మహిళలు

రాజమహేంద్రవరం సిటీ: జేఎన్ రోడ్డులోని జేకే గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన వసుధ ఫ్యాషన్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ నగర మహిళలను విశేషంగా ఆకట్టుకుంటోందని నిర్వాహకులు ప్రవీణ్ కుమార్, సీతాకాంత్ అన్నారు. వారు శుక్రవారం మాట్లాడుతూ గృహిణులు, మహిళలు, విద్యార్థినులకు ఉపయోగపడేలా దేశ నలుమూలల నుంచి ప్రఖ్యాతిగాంచిన సుమారు 50 మందికి పైగా డిజైనర్లు రూపొందించిన వస్త్రాలను ప్రదర్శనలో ఉంచామన్నారు. ముంబై, ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కతా, మధ్యప్రదేశ్, చెన్నై, హైదరాబాద్ నగరాల నుంచి తీసుకువచ్చిన లేటెస్ట్ డిజైనర్ వస్త్రాలను పరిచయం చేసినట్లు తెలిపారు. ఈ ప్రదర్శన 18వ తేదీ రాత్రి 9 గంటల వరకు ఉంటుందన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా

కంబాలచెరువు: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాజమండ్రి నగర్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు గురువెల్ల సాయి మాట్లాడుతూ జిల్లాలోని అనేక ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యా వ్యాపారం యథేచ్ఛగా నడుస్తోందన్నారు.

అవగాహన

ప్రకాశం నగర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన భోజనంతో పాటు ఉత్తమ విద్య అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ నర్సమ్మ తెలిపారు. సమగ్ర శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సిమ్మెంటరీపేట 1, 2 కేంద్రాలలో పూర్వ పాఠశాల విద్యపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: పనికి వెళ్లిన తన భర్త ఇప్పటివరకూ తిరిగి రాలేదని కవలగొయ్యి గ్రామానికి చెందిన కోనేటి భూమిక శుక్రవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కవలగొయ్యికి చెందిన 32 ఏళ్ల కోనేటి రాంబాబు స్థిరంగా ఎక్కడ పనిచేయడు. దీంతో భార్యభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈనెల ఆరోతేదీ ఉదయం 8.30 గంటల సమయంలో ఇంటినుంచి పనికి వెళుతున్నానని చెప్పి వెళ్లిన భర్త రాంబాబు తిరిగి రాలేదు. ఎస్సై జగన్‌మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడి అరెస్టు

రాజానగరం: స్థానిక జంగాలకాలనీలో ఆరేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన షేక్ మీరా వలీని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించామని సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు. గురువారం ఇంటి వద్ద ఆడుకుంటున్న బాలికను అన్నం పెడతానని ఇంటిలోకి తీసుకువెళ్లి అత్యాచారానికి ఒడిగట్టిన సంగతి విదితమే. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామన్నారు.

సచివాలయాలు.. సేవా నిలయాలు

- ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలు
- సమస్యలకు సత్వర పరిష్కారం
- సీఎం జగన్ పాలనపై ప్రజల హర్షం

రాజమహేంద్రవరం రూరల్: ఒకప్పుడు ప్రభుత్వ సేవలు పొందాలంటే సాధారణ పౌరులు ఎన్నో కష్టాలు పడేవారు. కొన్ని సేవలు పొందాలంటే మధ్యవర్తులను ఆశ్రయించి కొంత మొత్తంలో డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి ఉండేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సచివాలయ వ్యవస్థ రాకతో అలాంటి ఇబ్బందులకు చెక్ పడింది. సచివాలయాల్లో అందుతున్న సేవలపై ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కీలకమైన రెవెన్యూ సేవలతో పాటు జనన, మరణ ధ్రువీకరణ పత్రాల మంజూరు, పన్నులు చెల్లింపులు, సంక్షేమ



బొమ్మూరు సచివాలయం-4లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు

పథకాల అమలులో సిబ్బంది క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయా సచివాలయాల పరిధిలోని వలంటీర్లు క్షేత్రస్థాయిలో కార్యదర్శులకు సహాయంగా నిలిస్తున్నారు.

బాపూజీ కలలకు ప్రతిరూపం

మహాత్మా గాంధీ కన్న కలలకు ప్రతిరూపాలుగా సచివాలయాలు ఆవిర్భవించాయి. గ్రామ స్వరాజ్యాన్ని ప్రజలకు చేరువ చేయాలన్న లక్ష్యంతో



కాతేరు గ్రామసచివాలయం-5 భవనం

ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. రెండు వేల మంది జనాభా ప్రాతిపదికన గ్రామ, వార్డు సచివాలయాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. రాజమహేంద్రవరం రూరల్ మండలంలో మొత్తం 35 సచివాలయాలు ఉన్నాయి. వాటిలో 291 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తుండగా, 884 మంది వలంటీర్లు ప్రజలకు సేవలు అందిస్తున్నారు. ప్రతి గ్రామ సచివాలయంలో గ్రేడ్ -5 సెక్రటరీతో పాటు, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా సంరక్షణ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, అగ్రికల్చర్, వెటర్నరీ, ఫిషరీష్ సెక్రటరీలు అందుబాటులో ఉంటారు. జిల్లా కేంద్రాల్లో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తుంటే, గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఈ కార్యక్రమం జరుగుతోంది. అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా సచివాలయాలు పనిచేస్తున్నాయి.

ఆధార్ సేవలు సైతం

గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలను సైతం అందిస్తున్నారు. కాతేరు, కొంతమూరు, ధవళేశ్వరం, పిడింగొయ్యి గ్రామ సచివాలయాల్లో పూర్తి స్థాయిలో ఆధార్ సేవలను అందిస్తున్నారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకూ మండలంలో వేలమందికి ఆధార్‌కు సంబంధించి సేవలను అందించారు.

రేషన్ కార్డు పునరుద్ధరించారు



మాది సామన్య దిగువ తరగతి కుటుంబం. కుటుంబ పోషణ కోసం నా భర్త రాజశేఖర్ పాత కారును కొనుగోలు చేశారు. దానివల్ల రేషన్ కార్డు నిలిచిపోయింది. 2019 అక్టోబర్ 17న నా భర్త మృతి చెందాడు. కారును స్క్రాప్‌కు వేసేయడం జరిగింది. రేషన్ కార్డు పునరుద్ధరణ కోసం బొమ్మూరు గ్రామసచివాలయం-2లో దరఖాస్తు చేసినప్పటికీ రికార్డుల్లో కారు ఉన్నట్లు చూపించడంతో రిజెక్ట్ అయ్యేది. దీంతో సచివాలయ వెల్ఫేర్, వలంటీర్ కలిసి రవాణాశాఖ అధికారుల నుంచి కారు లేదన్న సర్టిఫికెట్ పెట్టడంతో రేషన్ కార్డు, వితంతు పింఛన్ సైతం మంజూరయ్యింది.

– కందికట్ల శ్రావణి, కొత్తపేట, బొమ్మూరు

ఒక్కరోజులో ఆరోగ్యశ్రీ కార్డు



నా కుమారుడు శ్రీరామ్మూర్తికి నాలుగు నెలల క్రితం ప్రమాదంలో కాలు విరిగిపోయింది. మాకు రేషన్ కార్డు ఉందిగానీ ఆరోగ్యశ్రీ కార్డు లేదు. వెంటనే బొమ్మూరు గ్రామసచివాలయం-3లో ఆరోగ్యశ్రీ కార్డుకు దరఖాస్తు చేశాం. ఒక్కరోజులోనే మాకు ఆరోగ్యశ్రీ కార్డు అందించారు. నా కుమారుడికి ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్స చేయించాం. సచివాలయంలో దరఖాస్తు చేసిన వెంటనే ఆరోగ్యశ్రీ కార్డు అందించడం మా ఆనందానికి అవధుల్లేవు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ పేదలకు ఎంతో మేలు చేస్తోంది

– బత్తిన సూర్యకుమారి, జేఎన్‌బీ నగర్, బొమ్మూరు

సచివాలయాల సేవలు భేష్



గ్రామాల్లో ఏర్పాటు చేసిన సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయం. ఆధార్ కార్డులో వయసు తప్పుగా వేయించుకున్నానన్న ఉద్దేశంతో పింఛన్‌ను నిలిపివేశారు. మళ్లీ గ్రామ సచివాలయంలో పింఛన్ పునరుద్ధరణ కోసం దరఖాస్తు చేయడంతో అధికారులు పరిశీలన చేశారు. కొద్ది కాలానికే వృద్ధాప్య పింఛన్ మంజూరు చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్ వచ్చి పింఛన్ ఇస్తున్నారు.

– గొట్టిపల్లి సూరిబాబు, ఏ బ్లాక్, శాటిలైట్ సిటీ

90 రోజుల్లో ఇంటి స్థలం



గ్రామ సచివాలయంలో వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లోనే నాకు ఇంటి స్థలం పట్టా అందజేశారు. వృద్ధాప్య పింఛన్ అర్హురాలైనప్పటికీ నా కుమార్తె ఇన్‌కంటాక్స్‌పే చేయడంతో మంజూరు కాలేదు. గ్రామ సచివాలయంలో వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసి, అన్ని ధ్రువపత్రాలు ఇవ్వడంతో 2022లో వృద్ధాప్య పింఛన్ మంజూరైంది. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారక ముందే వలంటీర్ వచ్చి పింఛన్ అందజేస్తోంది.

– కనిగిరి సుబ్బలక్ష్మి, ప్రకాశం ఎంప్లాయీస్ కాలనీ, కొంతమూరు

జిల్లాలోని 107 ప్యాక్ సొసైటీలకు కంప్యూటర్లు



మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ: జిల్లాలోని 107 ప్యాక్ సొసైటీలకు కంప్యూటర్లు, అనుబంధ పరికరాల కొనుగోలుకు జిల్లాస్థాయి అమలు, పర్యవేక్షణ కమిటీ ఆమోదం తెలిపి రాష్ట్రస్థాయి కమిటీకి సిఫారసు చేయడం జరిగిందని కలెక్టర్ కె. మాధవీలత తెలిపారు. జిల్లా సహకారశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన జిల్లాస్థాయి అమలు, పర్యవేక్షణ కమిటీ సమావేశానికి ఆమె చైర్మన్ హోదాలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను సాంకేతికంగా మరింత అభివృద్ధి చేసి, రైతులకు భరోసా ఇచ్చే క్రమంలో కంప్యూటర్, ఇతర అనుబంధ పరికరాలను అప్కాబ్ ద్వారా కొనుగోలుకు జిల్లాస్థాయి కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి వై.ఉమారావు, డీసీసీబీ ముఖ్యకార్యనిర్వహణాధికారి ఆర్‌వీ నరసింహారావు, కాకినాడ, ఏలూరు డీపీడీఎం బి.తేజ, పి.కొండలరావు పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా కంబాలచెరువు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని కంబాలచెరువును ఆహ్లాదకరంగా, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోని తీసుకు వస్తున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ అన్నారు. ఆయన శుక్రవారం కంబాలచెరువులో జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. పనులను వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆగస్టు నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పి.ప్రసాద్, కె.శ్రీధర్, ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజినీర్ భ్రమరాంబ ఉన్నారు.

కందుకూరి ఆశయసాధనకు కృషి

మహిళా కాలేజీని యూనివర్సిటీగా అభివృద్ధి చేస్తాం : ఎంపీ భరత్‌రామ్

కంబాలచెరువు: సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక ఎస్‌కేఆర్ మహిళా కళాశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలను మహిళా యూనివర్సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. వీరేశలింగం పంతులు ఎంతో మహదాశయంతో స్థాపించిన విద్యాసంస్థల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, అందులో భాగంగానే ప్రభుత్వం విద్యాశాఖలో విలీనం చేయడం జరిగిందన్నారు. ముందుగా కళాశాల ప్రాంగణంలోని కందుకూరి వీరేశలింగం పంతులు, రాజ్యలక్ష్మి దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల కరస్పాండెంట్, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ రాఘవ కుమారి, అధ్యాపకులు, హాస్టల్ సిబ్బంది, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ సిబ్బందితో ఆయన సమీక్షించారు. హాస్టల్ నిర్వహణకు సంబంధించిన ఖాతాను కరస్పాండెంట్ బ్లాక్ చేయడం జరిగిందని ఎంపీకి ప్రిన్సిపాల్ ఫిర్యాదు చేశారు. హాస్టల్ నిర్వహణకు సంబంధించి అప్పటినుంచి తామే ఖర్చులు చేస్తున్నామని వివరించారు. దీనిపై కరస్పాండెంట్ దేవ



ఎస్‌కేఆర్ మహిళా కళాశాలలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

దాయ శాఖ ఏసీ విజయలక్ష్మిని ఎంపీ వివరణ అడిగారు. అనంతరం దీనిపై లిఖితపూర్వకంగా సమస్యలను తెలియజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ మార్తి లక్ష్మి, సిటీ యూత్ ప్రెసిడెంట్ పీత రామకృష్ణ, వార్డ్ ఇన్‌చార్జి బొంత శ్రీహరి, హితకారిణి సమాజం డైరెక్టర్ ఉల్లూరి రాజు, ఇన్నీసుపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ అన్నపూర్ణరాజు, నాయకులు పాలిక శ్రీను, నక్క నగేష్, సీతనబోయిన సాయిరామ్ పాల్గొన్నారు.

వసతుల కల్పనకు ప్రాధాన్యం

రాజమహేంద్రవరం సిటీ: మౌలిక సదుపాయాల



వాంబే గృహాల్లో పర్యటిస్తున్న ఎంపీ భరత్‌రామ్

కల్పనకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ, సమస్యలను ఎక్కడికక్కడ పరిష్కరిస్తున్నట్టు ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. ఆయన శుక్రవారం 45వ డివిజన్ ఆర్‌అండ్‌బీ వాంబే గృహాల సముదాయంలో పర్యటించారు. రూ.87.50 లక్షల అంచనా వ్యయంతో సెప్టిక్ ట్యాంక్ నిర్మాణానికి ఆదేశించారు. స్థానికులు తెలిపిన సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, గౌడ శెట్టిబలిజ యాత ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను, సిటీ మహిళా అధ్యక్షురాలు మర్తి లక్ష్మి, సిటీ యూత్ ప్రెసిడెంట్ పీత రామకృష్ణ, డివిజన్ ఇన్‌చార్జి కస్సే రాజేష్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సీఎం జగన్ ప్రాధాన్యం

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- విద్యాకానుక పంపిణీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. 28వ డివిజన్ ధాన్యంపాకలు మున్సిపల్ పాఠశాలలో ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బిల్డర్ చిన్న ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు జగనన్న విద్యాకానుకను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ చదువే మనిషికి ఆభరణమని, విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. పాఠశాల ప్రారంభం రోజునే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం,



జగనన్న విద్యాకానుకను పంపిణీ చేస్తున్న చందన నాగేశ్వర్

షూ, నోట్ పుస్తకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తాటికొండ విష్ణుమూర్తి, పెయ్యల రాజేష్, సత్తిరాజు, గౌరీశంకర్, మత్సేటి శివ, కనకలింగేశ్వరరావు, అచ్చిరాజు, క్రాంతికుమారి, జ్యోతి పాల్గొన్నారు.

30, 1 తేదీల్లో మెగా క్యాన్సర్ స్కానింగ్ శిబిరం

రాజమహేంద్రవరం రూరల్/రాజమహేంద్రవరం సిటీ: రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్, జీఎస్ఎల్ క్యాన్సర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 30, జూలై ఒకటో తేదీల్లో స్థానిక గోదావరి గట్టున ఉన్న త్యాగరాజు నారాయణదాసు సేవాసమితి భవనంలో మెగా క్యాన్సర్ స్కానింగ్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం టి.నగర్‌లో త్రిదండి చిన్నజీయర్ స్వామిజీ చేతుల మీదుగా పోస్టర్లను ఆవిష్కరించారు. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్ ప్రెసిడెంట్ తీగెల రాజా మాట్లాడుతూ నగరం, పరిసర గ్రామాల మహిళలు ఈ శిబిరంలో పరీక్షలు చేయించుకుని రిపోర్టులు తీసుకోవచ్చన్నారు. అవసరమైన వారికి జీఎస్ఎల్ డాక్టర్ తరుణ్ ఉచిత వైద్యం (ఆరోగ్యశ్రీ, సెంట్రల్ గవర్నమెంట్ స్కీం ద్వారా) చేస్తారన్నారు. 91326 26999, 77118 34567 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేయించుకోవాలని



శిబిరం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చిన్నజీయర్ స్వామీజీ

సూచించారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ అనుకుమార్, ట్రెజరర్ గ్రంధి రాజా, ప్రోగ్రామ్స్ చైర్మన్ దుర్గా ప్రసాద్, డైరెక్టర్లు మూర్తి, తారకేశ్వర్, కిమిడి జాన్, గ్రంధి రాజా, గ్రంధి సుబ్బారావు, మూర్తి, రాంబాబు పాల్గొన్నారు.

విద్యారంగం అభివృద్ధికి విశేష కృషి

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- విద్యార్థులకు పురస్కారాల ప్రదానం

ధవళేశ్వరం: విద్యారంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విశేష కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. శుక్రవారం ధవళేశ్వరం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చందన నాగేశ్వర్.. పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పురస్కారాలను ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు విద్యార్థులతో కళకళలాడుతున్నాయన్నారు. కార్యక్రమంలో హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ దండగుల మరిడయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు ముత్యాల పోసి కుమార్, డాక్టర్ అనసూరి పద్మలత, జేసీఎస్ తాడాల చక్రవర్తి, తాటికొండ విష్ణుమూర్తి, సచివాలయం కన్వీనర్లు తలారి వరప్రసాద్, పేర్ల బాసి, రేగుళ్ల రాజు, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, దాసరి ధర్మ, కల్యా



ధవళేశ్వరంలో విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న చందన నాగేశ్వర్

జీరెడ్డి, నాయకులు శ్రీరంగం బాలరాజు, చప్పిడి జ్యోతి, పందిళ్ల భానుప్రసాద్, ముత్యాల జాన్, గూటం రాజు, బర్రి సుబ్బారావు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

రాజమహేంద్రవరం రూరల్: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ అందజేస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. కాతేరు సచివాలయం-1 పరిధిలోని వలంటీర్లను శుక్రవారం సేవామిత్ర పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో కాతేరు సొసైటీ అధ్యక్షుడు ఆచంట కల్యాణ్, మండల జేసీఎస్ కన్వీనర్ తాటికొండ విష్ణు, కాతేరు సచివాలయం కన్వీనర్లు పెనుమాక సునీల్, మద్దా దుర్గారావు, చీకట్ల రంజిత్, రొంగల వెంకటేష్, నక్కా ధనరాజు, చిక్కాల కిరణ్, మదిని రాజేష్, ప్రదీప్, గంగిపాముల సురేష్, రాజకుమార్, రాజు, కొల్లి నాని, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ స్థలం పరిశీలన

కడియం: కడియంలో రైతుబజార్‌కు ప్రతిపాదించిన స్థలాన్ని మార్కెటింగ్ శాఖ ఇంజినీరింగ్ అధికారి పి.వెంకటేశ్వరరావుతో కలిసి వైఎస్సార్ సీపీ రాష్ట్రకార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) శుక్రవారం పరిశీలించారు. కాకినాడ కెనాల్‌ను ఆనుకుని ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలోని 50 సెంట్ల విస్తీర్ణం గల భూమిని దీనికోసం ప్రతిపాదించారు. ఇక్కడ రైతుబజార్ ఆవశ్యకతను ఎంపీ మార్గాని భరత్‌రామ్, కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్‌కు వివరించడంతో రూ.61 లక్షలు కూడా మంజూరు చేశారని గిరజాల బాబు తెలిపారు. అయితే కోర్టు కేసుల నేపథ్యంలో ఆలస్యమైందన్నారు. ఎట్టకేలకు కోర్టు కేసులు వీడడంతో పనులకు టెండర్లు పిలవడం జరిగిందన్నారు. కాంట్రాక్టర్లను సంప్రదించి నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటు



స్థలాన్ని మార్కెటింగ్‌శాఖ అధికారులకు చూపిస్తున్న గిరజాల వీర్రాజు

న్నామని వివరించారు. కార్యక్రమంలో కొత్తూరి బాలనాగేశ్వరరావు, ఆర్ఎస్ఎస్ మూర్తి, కుసునూరి బాబులు, పున్నమరాజు వీర్రాజు పాల్గొన్నారు.

వర్గీకరణతోనే మాదిగల అభ్యున్నతి



మాట్లాడుతున్న బ్రహ్మయ్య మాదిగ

రాజమహేంద్రవరం సిటీ: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల అభ్యున్నతి సాధ్యమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ అన్నారు. రాజమహేంద్రవరం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం మాదిగ ఆత్మగౌరవ రిజర్వేషన్ల పరిరక్షణ సమితి మొదటి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ల వర్గీకరణ ఉద్యమం 1994లో ప్రారంభమైందని, 1999లో ఏబీసీడీ వర్గీకరణ జరిగిందన్నారు. మోసపూరితమైన ఉద్యమ నాయకత్వం వల్ల మాదిగలు వంద శాతం తిరోగమనంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జూలై 7వ తేదీ నాటికి ఎమ్మార్పీఎస్ ఉద్యమం ప్రారంభించి 29 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా మాదిగలలో చైతన్యం నింపేందుకు జూలై 7వ తేదీన విజయవాడలోని జింఖానా గ్రౌండ్లో మాదిగల జన జాగృతి సభ నిర్వహిస్తున్నామన్నారు. వేలాదిగా మాదిగలు తరలి వచ్చి జయప్రదం చేయాలని పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో మాదిగ ఆత్మగౌరవ రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు వల్లూరి నాని మాదిగ, గౌరవ అధ్యక్షులు చిడిపి స్టాలిన్ మాదిగ, రాష్ట్ర అధ్యక్షులు మందపల్లి రవి మాదిగ మాజీ కార్పొరేటర్ ఈతకోటి బాపన సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.